సాక్షి
వికారాబాద్
శనివారం । 15 । జూలై । 2023



వేతనం అందేదెప్పుడో..?

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినా నేటికీ అమలు కావడంలేదు. 8లో▸



పేదల కల్పవృక్షం..

అడవిలో లభించే విప్ప కాయలను సేకరించి పరకగా మార్చి విక్రయిస్తూ గ్రామీణ మహిళలు ఉపాధి పొందుతున్నారు. 8లో▸



కలగానే కల్వర్టుల నిర్మాణం

రవాణా సౌకర్యం కోసం రహదారుల నిర్మాణం ఎంత ముఖ్యమో.. కల్వర్టులు అంతే ముఖ్యం. 9లో▸

న్యూస్‌రీల్

ఎనిమిది మంది పోలీసులకు సేవా పతకాలు



ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది పోలీసు అధికారులకు రాష్ట్ర సేవా పతకాలు వచ్చాయని ఎస్పీ కోటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరిలో కుల్కచర్ల ఏఎస్‌ఐ సత్యశీలరెడ్డి, ఏఆర్ ఎస్‌ఐ నర్సింహులు, ధారూర్ ఏఎస్‌ఐ మురళీధర్, పెద్దేముల్ పీఎస్‌కు చెందిన రమేశ్, ఏఆర్ హెచ్‌సీ అనంతయ్య, కరన్‌కోట పీఎస్‌లో పనిచేసే పవన్‌కుమార్, పరిగి పీఎస్‌కు చెందిన కేశవులు, వికారాబాద్ పీఎస్‌లో పనిచేసే వేణుగోపాల్‌లు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించారు.

ఎస్‌ఐల బదిలీలు

అనంతగిరి: జిల్లాలో పలువురు ఎస్‌లను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణను పరిగి ఎస్‌హెచ్‌ఓగా, కొడంగల్ పీఎస్‌లో పనిచేసే హల్దాస్ రవిని దోమ ఎస్‌హెచ్‌ఓగా బదిలీ చేశారు. దోమ ఎస్‌హెచ్‌ఓగా ఉన్న ఎస్.విశ్వజన్‌ను వికారాబాద్ ఎస్‌ఐ-1గా బదిలీ అయ్యారు.

సర్కారు బడుల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తాం

డీసీడీఓ శ్రీదేవి



మోమిన్‌పేటలో పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న శ్రీదేవి

మోమిన్‌పేట: ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తామని జిల్లా చైల్డ్ డేవలప్‌మెంట్ అధికారి (డీసీడీఓ) శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని యూఆర్‌ఎస్ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో తాగేందుకు సైతం మంచినీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె వారం రోజులలో సరిపడా నీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కలిస్తామని ఆమె తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట పాఠశాల ఇన్‌చార్జి రాములు, ఎంఆర్‌సీ పద్మారావు తదితరులు ఉన్నారు.

కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకం



నియామక పత్రం అందజేస్తున్న డీఈఓ

వికారాబాద్ అర్బన్: జిల్లా సమగ్ర శిక్షలో ఏడుగురిని ఆయా విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామక పత్రాలు అందించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి తెలిపారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రోగ్రామర్లు, ఐఈఆర్పీలు తదితర పోస్టుల్లో భర్తీ చేసినట్లు తెలిపారు. 2019లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం వీరిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వం ఇటీవల భర్తీకి అనుమతి ఇవ్వడంతో మెరిట్ ఆధారంగా నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు.

అదనపు కలెక్టర్లుగా ప్రతిమ సింగ్, భూపాల్‌రెడ్డి

అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సహా ఆర్డీఓల బదిలీ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: జిల్లాలో అధికారుల బదిలీల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే అదనపు కలెక్టర్ (రెవెన్యూ) తిరుపతిరావును వికారాబాద్ డీఆర్‌ఓగా బదిలీ చేయగా, తాజాగా మరో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతీక్‌జైన్‌ను భద్రాచలం సమీకృత గిరిజన సంక్షేమాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా బదిలీ చేసింది. ఆయన స్థానంలో మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రతిమ సింగ్‌ను నియమించింది. అలాగే అదనపు కలెక్టర్‌గా (రెవెన్యూ) ఎంవీ భూపాల్‌రెడ్డిని నియమించింది. ఈయన భువనగిరి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా పనిచేసి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఈ. వెంకటాచారిని కూడా బదిలీ చేశారు. ఆయన స్థానంలో డిప్యూటీ కలెక్టర్ అనంతరెడ్డిని నియమించారు.

అర్హులందరికీ ఓటు హక్కు

- ఈవీఎం, వీవీప్యాట్ల వినియోగంపై అవగాహన కల్పించండి
- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: నియోజకవర్గాల వారీగా ప్రతి గ్రామంలో పర్యటించి ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, రాష్ట్ర స్థాయి అధికారులు త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. సెప్టెంబర్ నాటికి జిల్లా మొత్తం ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా పకడ్బందీగా ఉండాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల వివరాలు పురుషులు, స్త్రీలు, వయస్సు వంటి వివరాలు ఉండాలన్నారు. జనాభా నిష్పత్తి వివరాలు, లింగ నిష్పత్తి వివరాలు తయారు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లింగ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు



జనగాం గ్రామంలో బోనాలతో తరలివస్తున్న మహిళలు



బోనమెత్తిన చిన్నారి

ఊరడమ్మకు బోనాలు

పెద్దేముల్ మండలం జనగాంలో బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత ఊరదమ్మ తల్లికి మహిళలు బోనాలతో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

– పెద్దేముల్

కులవృత్తికి జీవం..
'లక్ష'ణంగా జీవనం

వెనుకబడిన వర్గాల కుల, చేతివృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత నందిస్తోంది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పల్లెల్లో కులవృత్తిదారులు దుర్భర జీవనం కొనసాగిస్తున్నారు. కొందరు కులవృత్తిని వదిలేసి కూలీలుగా మారుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం వారికి బాసటగా నిలుస్తోంది. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీసీ కులవృత్తులకు ఆర్థిక చేయూత పథకం లాంఛనంగా ప్రారంభించగా శనివారం నుంచి ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయనున్నారు. మొదటి విడతలో 1200 మందికి ఆర్థిక సాయం అందించనున్నారు.



నేటి నుంచే రూ.లక్ష సాయం

- ఎమ్మెల్యేల ద్వారా అందజేత
- 36 ఎంబీసీ, 14 బీసీ కులాలకు అవకాశం
- వచ్చిన దరఖాస్తుల్లో అర్హులు: 9,607
- మొదటి విడతలో మంజూరైనవి: 1,200

వికారాబాద్: అర్హులైన బీసీ కుల, చేతివృత్తిదారులకు రూ.లక్ష సాయం అందించేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేల చేతులమీదుగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఎంబీసీ కులాల నుంచి 36 కులాలకు, బీసీ కులాల నుంచి 14 కులాలకు మొత్తం 50 బీసీ వెనుకబడిన కులాలకు ప్రభుత్వం ఈ పథకం అమలు చేయనుంది. ముందుగా 14 కులాల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా కుటుంబానికి ఒకరికి చొప్పున రూ.లక్ష ఆర్థిక చేయూత పేరుతో ప్రభుత్వం గ్రాంటు రూపంలో ఇవ్వనుంది. వికారాబాద్‌లో ఎమ్మెల్యే ఆనంద్, పరిగిలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, కొడంగల్‌లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, తాండూరులో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారు.

జిల్లా నుంచి 9,607 మంది

ఇప్పటికే కుల వృత్తులకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా జిల్లా వ్యాప్తంగా 13,157 దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఎంపీడీఓలు 9,607 మందిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులుగా తేల్చారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించారు. 3,141 మంది అనర్హులుగా తేల్చగా మరో 409 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అర్హులుగా తేల్చిన లబ్ధిదారులందరికీ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా మొదటి విడతగా 1200 మందిని గుర్తించింది. నియోజకవర్గానికి 300 మందికి చొప్పున ఆర్థిక సాయం అందనుంది.

ఎమ్మెల్యేలకు ఆశాభంగం!

లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలకు ఆశాభంగం ఎదురైనట్లు తెలుస్తోంది. కావాల్సిన వారికి ఎంపిక చేసేందుకు వీలులేకుండా విధివిధానాలు ఉండటంతో ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. నమ్ముకుని నెలల తరబడి తమచుట్టూ తిరుగుతున్న వారికి ఏమి చెప్పాలో తెలియని పరిస్థితి తలెత్తింది. వచ్చిన దరఖాస్తుల నుంచి క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎంపీడీఓలు ప్రభుత్వానికి జాబితా పంపగా వాటిని ప్రభుత్వం ఖరారు చేసింది. అందులో మొదటి విడతగా నియోజకవర్గానికి 300 మంది చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో ఎవరికి ఇవ్వాలనే విషయంలో ఎమ్మెల్యేలు, స్థానిక అధికారులతో కలిసి జాబితా సిద్ధం చేసే అవకాశం ఉంటుందని భావించారు. కానీ పైస్థాయిలోనే 1200 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసి జాబితాను కలెక్టర్‌కు పంపించారు. జాబితాలో పేర్లున్నవారికే ఎమ్మెల్యేలు చెక్కులు అందజేయాల్సి ఉంది. దీంతో వారి ప్రమేయం ఏమీ లేకుండానే జాబితా తయారై రావటంతో నిరాశనెలకొంది.

అర్హులందరికీ అందిస్తాం



బీసీ కుల వృత్తుల వారికి ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం అర్హులందరికీ అందుతుంది. మూడు నెలల్లో ఎంపికైన వారందరికీ ఆర్థిక సాయం అందజేసేలా ప్రభుత్వం విధివిధానాలు రూపొందించింది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పారదర్శకంగా అర్హుల జాబితా రూపొందించాం. కులవృత్తులను ఆదుకోవడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

వికారాబాద్, పరిగి మున్సిపాలిటీలకు
రూ.85 కోట్లు

- టీయూఎఫ్‌ఐడీసీ నుంచి భారీగా రుణం
- వికారాబాద్‌కు రూ.60 కోట్లు, పరిగికి రూ.25కోట్లు
- మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యేలు

వికారాబాద్ అర్బన్/పరిగి: వికారాబాద్, పరిగి మున్సిపాలిటీల అభివృద్ధికి భారీగా రుణం మంజూరు అయ్యింది. వికారాబాద్‌కు రూ.60 కోట్లు, పరిగికి రూ.25 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నుంచి రుణం పొందేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శుక్రవారం జీఓ విడుదల చేసింది. వికారాబాద్, పరిగి మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.85 కోట్లు కేటాయించడంపై ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డిలతో శుక్రవారం మంత్రి కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా మున్సిపాలిటీల అభివృద్ధికి ఇంత పెద్దమొత్తంలో నిధులు కేటాయించలేదన్నారు. చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల సైతం కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రూ.60 కోట్లతో పట్టణం ఎంతో అభివృద్ధి చెందనుందన్నారు.

అభివృద్ధికి అడుగులు

మంత్రి కేటీఆర్ ఆదేశం మేరకు గత ఏడాది డిసెంబర్ 6న మున్సిపల్ సీడీఎంఏ సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఓఎస్‌డీ మహేందర్, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, చైర్‌పర్సన్ మంజుల కలిసి వికారాబాద్ మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కలియ తిరిగి పరిశీలించారు. రాష్ట్ర స్థాయి అధికారుల బృందం సైతం జిల్లా కేంద్రంలో పర్యటించడంపై అప్పటి నుంచి పట్టణ ప్రజలు, నాయకులు నిధులపై ఆశలు పెట్టుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించిన వాటిలో ప్రధానంగా మన్నెగూడ నుంచి అనంతగిరి వరకు నాలుగులేన్ల రోడ్డు, ఎన్నెపల్లి నుంచి మద్గుల్ చిట్టంపల్లి వరకు, ఎన్టీఆర్ చౌరస్తా నుంచి అనంతగిరి వరకు, బీజేఆర్ నుంచి బుగ్గ రామేశ్వరం వరకు, బీజేఆర్ నుంచి కొత్తగడి వరకు రోడ్డు డివైడర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించాలని నిర్ణయించారు. రైల్వే బ్రిడ్జి మరమ్మతులతో పాటు, క్రీడా మైదానం ఏర్పాటు, జిల్లా కేంద్రంలోని ప్రధాన ఐదు చౌరస్తాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలను అప్పట్లో అధికారులు గుర్తించారు. హైదరాబాద్ ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న శివారెడ్డిపేట చెరువును మినీ ట్యాంక్ బండ్ చేయడంపై అధికారుల బృందం ప్రజా ప్రతినిధులతో సమాలోచనలు చేశారు. వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధిపై కేటీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారని అప్పట్లో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్‌లు తెలిపారు. అధికారులు డీపీఆర్ తయారు చేసి సమర్పిస్తే, రూ. 150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు మంజూరు చేసేందుకు అవకాశం ఉందని ప్రకటించారు. ప్రస్తుతం రూ. 60కోట్లు మంజూరు చేయడం అందులో భాగమేనని ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. దశల వారీగా అనుకున్నంత నిధులు మంజూరు చేసేందుకు కేటీఆర్ సిద్ధంగా ఉన్నట్లు ఈ సందర్భంగా వారు ప్రకటించారు.



మంత్రి కేటీఆర్ నుంచి జీఓ కాపీని అందుకుంటున్న మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్

ఇంకుడు గుంతల నిర్మాణం
వేగిరం చేయండి

జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్

మోమిన్‌పేట: గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏన్కతల, చీమల్‌దరి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత, పబ్లిక్ ప్రదేశాలలో నిర్మించే ఇంకుడు గుంతలను వెంటనే పూర్తి చేయాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాల్సిందేనన్నారు. బోరు మోటారుల వద్ద, చేతి పంపుల వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని సూచించారు. మురుగు కాల్వలు నిర్మించిన గ్రామంలో కాలువ చివరలో తప్పని సరిగా ఇంకుడు గుంతను నిర్మించాలన్నారు. సరిపడా వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట డీఎల్‌పీఓ అనిత, ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, ఏపీఎం రాజు, కార్యదర్శులు మైపాల్‌రెడ్డి, సుగుణ తదితరులు ఉన్నారు.



చీమల్‌దరిలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డీపీఓ తదితరులు

'కాంగ్రెస్‌ది విధ్వంస ఆలోచన'

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌ది వెలుగుల పాలన అయితే.. కాంగ్రెస్‌ది విధ్వంస ఆలోచన అని ఎమ్మెల్యే కాలె యాదయ్య ధ్వజమెత్తారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. శుక్రవారం మండల కేంద్రంలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేశారు.

ఎన్నికలకు యంత్రాంగం సిద్ధం

- ఆర్డీఓ అశోక్‌కుమార్
- సెక్టోరియల్ అధికారులతో సమావేశం
- పోలింగ్‌కేంద్రాల్లో సౌకర్యాలపై నివేదిక

తాండూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికార యంత్రాంగం అంతా సిద్ధంగా ఉందని తాండూరు డివిజన్ ఆర్డీఓ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నియోజకవర్గంలో 266 పోలింగ్ కేంద్రాలున్నాయని చెప్పారు. వీటిని పర్యవేక్షించేందుకు గెజిటెడ్ అధికారులతో కూడిన సెక్టోరియల్ (రూట్)ఆఫీసర్లను 23 మందిని నియమించినట్లు తెలిపారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి 7 నుంచి 14 పోలింగ్ కేంద్రాలు కేటాయించామన్నారు. క్షేత్రస్థాయిలో సెక్టోరియల్ అధికారులు తిరిగి పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని చెప్పారు. అలాగే సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడి పరిస్థితిపై కూడా నివేదిక సమర్పించాలన్నారు. ఎన్నికలు ముగిసేవరకు సెక్టోరియల్ అధికారులుగా కొనసాగుతారన్నారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఒక హెడ్‌కానిస్టేబుల్ ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐఏఎస్ సంచిత్ గంగ్వార్, డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు, తహసీల్దార్ చిన్నప్పల నాయుడు, ఎంపీ డీఓ, ఏఓ, ఏఈ, ఎంఈఓలతో పాటు ఎస్‌ఐలు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌కుమార్

తాండూరు ఆర్డీఓగా శ్రీనివాస్‌రావు

తాండూరు: ఆర్డీఓగా శ్రీనివాస్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న అశోక్ కుమార్‌కు ఇటీవల అడిషనల్ కలెక్టర్‌గా పదోన్నతిపై నారాయణపేట్ జిల్లాకు నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీనివాస్‌రావు నేడో.. రేపో బాధ్యతలు స్వీకరించనున్నారని అధికారవర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

ముగిసిన అమ్మవారి జాతర



అమ్మవారి పూజలో ఏన్కతల గ్రామస్తులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతలలో అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం చివరి రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గురువారం బోనాలు సమర్పించి శుక్రవారం చీరె, సారెలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆలయం ఎదుట గ్రామస్తులంతా కూర్చుని ప్రత్యేక పూజల్లో పాలుపంచుకున్నారు.

బీసీల ఐక్యత చాటుదాం

బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం ప్రతినిధులు

తాండూరు టౌన్: బీసీల ఓట్లతో గద్దెనెక్కిన వారు బీసీల సమస్యలు పరిష్కరించకుండా మోసం చేస్తున్న పార్టీలకు మన ఐక్యతను చాటుదామని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన బీసీ రాజకీయ ప్లీనరీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం ఎల్‌బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించే రాజకీయ ప్లీనరీ విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో 60 శాతంకు పైగా జనాభా ఉన్న బీసీలకు 60 ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని, ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీసీ కులస్తుడిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పంటల సంరక్షణకు సూచనలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



రైతులతో జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

కొడంగల్ రూరల్: పంటల సంరక్షణకు రైతులు స్థానిక వ్యవసాయాధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని రుద్రారం గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. పంటల సాగులో చీడ పీడల బెడదపై వ్యవసాయాధికారులను సంప్రదిస్తూ మందుల పిచికారి, ఎరువుల వాడకం తదితర విషయాలను తెలుసుకోవాలని చెప్పారు. రైతువేదికల్లో ఏఈఓలు అందుబాటులో ఉంటారని, ఎప్పటికప్పుడు రైతులు తమ సమస్యలను వివరిస్తూ మందులను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రూ.10లక్షల ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్మికుడికి యూనిఫాం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్, నాయకులు వెంకట్, డేవిడ్, రాములు, కృష్ణయ్య, పాండు, వీరేందర్, లక్ష్మణ్, బోనయ్య, బాలరాజు పాల్గొన్నారు.



పవిత్రమాలలు తీసుకొస్తున్న అర్చకులు



శ్రీవారి పూజలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

వైభవంగా పవిత్రోత్సవం

పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ఆగమ శాస్త్రోకంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. పవిత్ర మాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి శ్రీవారి మూలమూర్తికి ఆలయ ఆవరణలో దేవాతామూర్తులకు సమర్పించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారు మాడ వీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. భక్తులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు.

– కొడంగల్

ప్రధానిని విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్



తాండూరు టౌన్: తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రధాని మోదీని విమర్శించేస్థాయి ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వ్యక్తిగత భద్రత కోసం ప్రభుత్వం కేటాయించిన సెక్యూరిటీని ఫొటో షూట్‌తో అపహాస్యం చేయడం తప్పిదమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోషూట్‌లపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపై, సుద్దగనుల్లో జరుగుతున్న అక్రమాలపై, తల్లడిల్లుతున్న తండాల అభివృద్ధిపై చూపాలని హితవు పలికారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టండి



తొర్మామిడిలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి

బంట్వారం: మండల పరిధిలోని ఆర్ అండ్ బీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి తొర్మామిడి చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొర్మామిడి కత్తెరబండ నుంచి మర్పల్లి రోడ్డు, బంట్వారం నుంచి ఎన్నారం, కోట్‌పల్లి, రొంపల్లి–ఓగులాపూర్ రోడ్లు ప్రమాదకరంగా మారాయన్నారు. తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకునే వారే లేదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మున్నాబాయ్, కోఆప్షన్ సభ్యుడు తౌఫిక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అజీమ్, గౌస్ నాయకులు సుదర్శన్, చిన్న నర్సింలు, సలీం, యాకుబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనం అందేదెప్పుడో..?

పెరిగిన వేతనాలకు నిర్వాహకుల ఎదురుచూపులు

నవాబుపేట: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం మూడు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ పెంచిన వేతనాలు నేటికీ అందక పోవడంతో నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధిలో 11 జెడ్పీహెచ్ఎస్, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 26 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఒక ఆదర్శ, కస్తూర్బా గాంధీ పాఠశాలలున్నాయి. ఇందులో 16 పాఠశాలల్లో ఏజెన్సీల ద్వారా, మిగిలిన పాఠశాలల్లో అక్షయపాత్ర నుంచి మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మొత్తం 43 పాఠశాలల్లో కలిపి 86 మంది ఏజెన్సీల నిర్వాహకులు పనిచేస్తున్నారు. వంద మంది లోపు విద్యార్థులున్న పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండటానికి ఒకరు, 100 నుంచి 200 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఇద్దరు కార్మికులను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. వీరికి ప్రభుత్వం గతంలో వెయ్యి రూపాయల వేతనం అందించేది. ఈ ఏడాది ఫిబ్రవరిలో వీరి వేతనాన్ని రూ.3వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వహకులు సంతోషించారు. అయితే వేతనాలు పెంచి నెలలు గడుస్తున్నా పెరిగిన వేతనం అందక నిర్వహకులు నిరాశ చెందుతున్నారు. పెంచిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.



నిధులు రాగానే జమ చేస్తాం

మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు పెంచిన వేతనాలకు సంబంధించిన నిధులు రాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే ఏజెన్సీల ఖాతాల్లో జమ చేస్తాం.

– గోపాల్, ఎంఈఓ ,నవాబుపేట

వర్షాలతో పంటలకు జీవం



పెద్దేముల్: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వానాకాలం పంటలు జీవం పోసుకున్నాయి. విత్తనాలు విత్తిన నాటి నుంచి సరైన వర్షాలు లేక అన్నదాతలు కాస్త ఇబ్బంది పడినా.. ఇటీవల కురిసిన వర్షాలతో కంది, పత్తి, మొక్కజొన్న, మినప పంటలు కళ సంతరించుకున్నాయి. దీంతో రైతులు కలుపుతీత, దంతెలు కొట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ అధికారులు వెల్లడించిన లెక్కల ప్రకారం ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

పంట రకం	సాగు వివరాలు(ఎకరాల్లో)
పత్తి	10,900
కంది	10,500
మినుము	1,110
పెసర	970
సోయ	210
మొక్కజొన్న	190
తెల్లజొన్న	120

బైక్, డీసీఎం ఢీ..

వ్యక్తి దుర్మరణం

మహేశ్వరం: ఎదురుగా వస్తున్న బైక్‌ను డీసీఎం ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం నాగారం–రామారావు చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. సీఐ మురి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని రామచంద్ర గూడకు చెందిన మెగావత్ దశరథనాయక్ (50) శుక్రవారం ఉదయం బైక్‌పై శంషాబాద్ కూరగాయాల మార్కెట్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో శంషాబాద్ నుంచి కూరగాయలు తీసుకుని రామచంద్రగూడకు వస్తున్న క్రమంలో నాగారం వద్దకు రాగానే మన్సాన్‌పల్లి చౌరస్తా నుంచి నాగారం వైపు అతివేగంగా వస్తున్న డీసీఎం వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. డీసీఎం డ్రైవర్ మహ్మద్ యూసఫ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలి



పోలీస్ స్టేషన్ ఆవరణలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎస్ సీపీఎస్ ఈయూ సభ్యులు

టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు అనిల్

కొడంగల్ రూరల్: ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసేందుకు కృషిచేయాలని టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల అనిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ బాలుర, ఎస్‌టీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, గురుకుల పాఠశాల ఆవరణల్లో ఆయా కార్యాలయాలకు సంబంధించిన ఉద్యోగులతో కలిసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16 నుంచి ప్రారంభించనున్న పాత పెన్షన్ సాధన రథ యాత్రను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. రాజస్థాన్, పంజాబ్, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్ తరహాలో మన రాష్ట్రంలోనూ సీఎం కేసీఆర్ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని అన్నారు. పాత పెన్షన్ విధాన పోరాటంలో ఉద్యోగులంతా భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈయూ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్, నాయకులు దినేష్, యూనియన్ కార్యవర్గ సభ్యులు చరణ్‌రాజ్, ఐజాక్, క్రాంతి, మున్సిపల్, పోలీస్, ఉద్యోగ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమేశ్‌బాబు

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటి సభ్యుడు రమేశ్‌బాబు

దోమ: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎస్.రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం లక్షలాది మంది డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన విద్యార్థులు టీఆర్‌టీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. నోటిఫికేషన్లు వేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని అసెంబ్లీలో ప్రకటించినా నేటికీ నోటిఫికేషన్ వేయకుండా తాత్సార్యం చేయడం వెనుక ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి టీఆర్‌టీ నోటిఫికేషన్ వేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆషాఢ మాసం.. అంత్రాల బోనం



పరిగి: ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు



కుల్కచర్ల: ఘనపూర్‌లో బోనాల ఊరేగింపు

అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్న మహిళలు

- నందడిగా మారిన గ్రామాలు

కుల్కచర్ల: మండల పరిధిలోని కుల్కచర్ల, అంతారం, ఘనపూర్, ఇప్పాయిపల్లి తదితర గ్రామాలలో పోచమ్మ, మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి బోనాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పోచమ్మ, ఈదమ్మ తల్లులకు..

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని అన్నారం గ్రామంలో శుక్రవారం పోచమ్మ, ఈదమ్మ తల్లులకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. అందంగా అలకరించిన బోనాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకుఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత తదితరులు పాల్గొన్నారు.

బూచన్‌పల్లి, దామస్తాపూర్ గ్రామాల్లో..

మర్పల్లి: మండల పరిధిలోని బూచన్‌పల్లి, దామస్తాపూర్ గ్రామాల్లో శుక్రవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం బోనాలను అందగా అలంకరించి సాయంత్రం డప్పు వాయిద్యాలు, పోతురాజుల నృత్యాల నడుమ బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఊరడమ్మ, పోచమ్మ, మైసమ్మ, దుర్గమాత ఆలయాల చుట్టూ మహిళలు ప్రదక్షణలు చేశారు. దేవత మూర్తులకు నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జయ, కె.జైపాల్‌రెడ్డి గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ఘనంగా పూజలు

బొంరాస్‌పేట: 'బోనం.. ఆషాఢంలో అమ్మోరికి భోజనం'అంటూ ఊరూరా ఆషాఢం మాసం బోనాలను శుక్రవారం పండుగలా జరుపుకున్నారు. పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని రేగడిమైలారం, వడిచర్ల, లగచర్ల, పోలెపల్లి తదితర గ్రామాల్లో ఆషాఢమాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.

ప్రజాప్రతినిధుల పూజలు

పరిగి: పట్టణ కేంద్రం బహార్‌పేట్ పోచమ్మతల్లి ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమం మధుసదన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్ రెడ్డి హాజరయ్యారు. వారి వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



పరిగి: సయ్యద్ మల్కాపూర్‌లో బోనంతో చిన్నారి



కొడంగల్ రూరల్: అన్నారం గ్రామంలో..



మర్పల్లి: దామస్తాపూర్‌లో..

నిరుపేదల కల్పవృక్షం.. 'విప్ప'

ఉపాధి పొందుతున్న గ్రామీణ మహిళలు



విప్పకాయల పొడి తయారు చేస్తున్న రుద్రారం మహిళలు

ధారూరు: అడవిలో లభించే విప్ప కాయలను సేకరించి పరకగా మార్చి విక్రయిస్తూ గ్రామీణ మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు ఎక్కడ చూసిన విప్ప చెట్లే కన్పించేవి. మానవుని గొడ్డలి వేటుకు క్రమంగా కనుమరుగవుతూ వచ్చాయి. ప్రస్తుతం అక్కడక్కడ మిగిలిన ఈ చెట్లతో అడవి సమీప మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు విప్ప పువ్వు సారాయి ఆరోగ్యానికి మేలు చేస్తుందని సేవించేవారు. ప్రస్తుతం విప్పపువ్వు లేకుండా చేస్తున్న నాటుసారాయిపై ప్రభుత్వం నిషేధం విధించింది. మార్చిలో పూతపూసి ఏప్రిల్ నుంచి కాయ సిద్ధమవుతుంది. విప్పచెట్టు బెరడుతో కషాయం చేసుకుని తాగితే గర్భం నిలబడుతుందనేది నానుడి. ఇప్పపువ్వు, కాయలను ఆదివాసీలు ఎక్కువగా సేకరించి, విక్రయిస్తూ కుటుంబ పోషణ చేస్తుంటారు. విప్పచెట్టు గాలి ఆరోగ్యానికి మేలనీ ఆయుర్వేద వైద్యులు సూచిస్తుంటారు. విప్ప కాయల రసం చర్మ వ్యాధులకు చెక్‌పెడుతుంది. ప్రస్తుతం ధారూరు మండల పరిధిలోని రుద్రారం, గట్టెపల్లి, ఆరంపూర్‌తండా, తిమ్మానగర్ తదితర గ్రామాల మహిళలు విప్పకాయలను సేకరిస్తూ వాటిని నలిపి పొడిగా మార్చి ఎండబెట్టి కిలో రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాగాంధీ

యాచారం: రెవెన్యూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరాగాంధీ రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో శుక్రవారం 'వ్యవసాయరంగం–న్యాయ సలహాలు'అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ చట్టాలపై అవగాహన లేక రైతులు మోసపోతున్నారన్నారు. కోర్టుకు వచ్చే కేసుల్లో అధికంగా భూములకు సంబంధించినవేనని తెలిపారు. రైతులు గట్లు, గుంటల విషయాల్లో ఘర్షణలకు దిగుతూ కేసులపాలవుతున్నారని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్ల సామగ్రి కొనుగోలు సమయంలో రైతులు రశీదులు పొందాలని సూచించారు. రైతులు మోసపోయిన సమయాల్లో వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించి పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీపీ సుకన్య, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏడీఏ సత్యనారాయణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు.